# విశాల భారతి

15-07-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 191




## సివిల్స్ ఉచిత కోచింగ్

- మొత్తం 150 సీట్లు. మెయిన్స్ అభ్యర్థులకు 50, స్క్రీనింగ్ ద్వారా 100
- 2027 సివిల్స్ కోసం ఆగస్టు 24 నుంచి ఉచిత కోచింగ్
- నెలకు రూ. 5 వేల స్టైఫండ్, పుస్తకాల కోసం రూ. 5 వేల ప్రోత్సాహకం
- డిగ్రీ ఉత్తీర్ణత, నిర్ణీత వార్షిక ఆదాయ పరిమితి ఉండాలి
- జులై 17 నుంచి ఆగస్టు 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆగస్టు 16న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు

02



## ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీబిజీ

- 2028 జూన్ నాటికి మామునూరు విమానాశ్రయం పూర్తికి విజ్ఞప్తి
- వరంగల్, ఆదిలాబాద్‌లో ఎయిర్‌కార్గో, ఎమ్మార్వో సదుపాయాల కల్పన
- పౌర విమానాశ్రయ ఏర్పాటుకు భూమిని కేటాయిస్తామన్న ప్రభుత్వం
- హైదరాబాద్-విజయవాడ మధ్య సీ-ప్లేన్ల ప్రతిపాదన

02



## తప్పుడు ప్రచారాను నమ్మొద్దు

- ఏఐతో రూపొందించిన నకిలీ వీడియోలతో దుష్ప్రచారం
- సామాజిక వర్గాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు

05



తెలంగాణ రాజకీయ రంగస్థలం ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ కేంద్రీకృతమై ఉధృతమైన చర్చలకు దారితీస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన ఈ భారీ ప్రాజెక్టు ఇప్పుడు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికగా మారింది. గతంలో అప్పుల భారంతో కుస్తీ పట్టిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పుడు ఈ నీటి పారుదల ప్రాజెక్టు లోపాలపై పరస్పరం సవాళ్లు విసురుకుంటున్నాయి. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు మేడిగడ్డ వద్ద కుంగిపోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించింది.

# ఎన్నికల వరకు కాళేశ్వరమేనా..?

## కాళేశ్వరం వేదికగా కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోరు

- ప్రాజెక్టును పునరుద్ధరించి రైతులకు నీరందించాలి
- అవినీతి, నిర్మాణ లోపాలే ప్రాజెక్టు వైఫల్యానికి కారణం
- కేటీఆర్ పర్యటనలు, సీఎం సవాళ్లతో పెరిగిన వేడి
- ప్రత్యేక చర్చకు సీఎం సిద్ధం, కేసీఆర్ హాజరుపై ఉత్కంఠ
- ఎన్నికల వరకు ఇదే ప్రధాన రాజకీయ అంశం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** దీనిని తెలంగాణ వరప్రదాయినిగా బీఆర్ఎస్ అభివర్ణిస్తుంటే, కాంగ్రెస్ నాయకులు కూలేశ్వరంగా విమర్శిస్తున్నారు. రాబోయే ఎన్నికల నాటికి ఈ ప్రాజెక్టు అంశం ప్రజల మధ్య ప్రధాన రాజకీయ అస్త్రంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాజెక్టు భవిష్యత్తుపై అస్పష్టత నెలకొనడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రాజకీయ లబ్ధి కోసం పార్టీలు ఈ అంశాన్ని వాడుకుంటున్న తీరు విమర్శలకు దారితీస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఈ ప్రాజెక్టును ప్రపంచ ఇంజనీరింగ్ అద్భుతంగా పేర్కొంటూ తన వాదనను గట్టిగా వినిపిస్తోంది. కొన్ని పిల్లర్లు దెబ్బతిన్నంత మాత్రాన మొత్తం భారీ ప్రాజెక్టును పక్కన పెట్టడం అవివేకమని ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీలో నీటిని నిల్వ చేసి, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి

మిగతా 2లో..

## ఈటల సింగరేణి భరోసా యాత్ర

- సింగరేణిని కాపాడటమే బీజేపీ లక్ష్యం
- లక్షలాది మందికి ఉపాధినిచ్చిన గొప్ప సంస్థ
- 1.20 లక్షల నుంచి 40 వేలకు పడిపోయిన కార్మిక సంఖ్య
- సంస్థ బలోపేతానికి ప్రధాని మోదీ తాడిచెర్ల మైన్ కేటాయింపు
- గత పాలకులు సింగరేణిని నిర్వీర్యం చేశారు
- గని కేటాయింపునకు కృషి చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సింగరేణి సంస్థ పరిరక్షణే లక్ష్యంగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాడిచెర్ల గని వద్ద చేపట్టిన సింగరేణి భరోసా యాత్రలో ఆయన పాల్గొని సంస్థ భవిష్యత్తుపై భరోసా కల్పించారు. ఉత్తర తెలంగాణ ప్రాంత అభివృద్ధిలో బొగ్గు గనులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన కొనియాడారు. దేశానికి వెలుగునిచ్చే సింగరేణిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. వంద ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థ ద్వారా లక్షలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని చెప్పారు. గడిచిన కాలంలో కార్మికుల సంఖ్య

మిగతా 3లో..

## హెచ్ఎండీఏ 'చీఫ్' అక్రమాల సామ్రాజ్యం బట్టబయలు

ఏసీబీ వేటలో వంద కోట్ల బినామీ బాగోతం

04



# ఆగస్టులోనూ తిప్పలు..!

- వర్షా భావం దృష్ట్యా మూడు దశల్లో విత్తనాల పంపిణీ
- వర్షపాతం, భూగర్భ జలాల కోసం ప్రత్యేక వ్యవస్థ
- వాతావరణం, సాగు సలహాలతో ప్రతి వారం నివేదికలు
- తేమ సంరక్షణ, సరైన విత్తన పద్ధతులపై అవగాహన
- నీటి ఎద్దడి దృష్ట్యా తక్కువ నీటి పంటలకే ప్రాధాన్యత
- క్షేత్రస్థాయిలో రైతులకు నిరంతరం వ్యవసాయ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు నెలల పాటు వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని కేంద్ర నిపుణులు హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

మిగతా 3లో..



## బావ-బామ్మర్దుల ఆటలు ఇక సాగవు

- గత అరాచక పాలనను ప్రజలు తిరస్కరించారు
- పాలమూరు-రంగారెడ్డి పనులను వేగవంతం చేస్తాం
- కృష్ణా జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీలో దేశంలోనే నంబర్ వన్
- రాబోయే ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ గడ్డపై దొరల పాలనకు చరమగీతం పాడి, ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజల తీర్పును గౌరవించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హితవు పలికారు. గద్వాల జిల్లా మల్దకల్ మండలం కుర్తిరావుల చెరువులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనుభవించిన ఇబ్బందులను, అరాచకాలను గుర్తుచేశారు. ఆ పార్టీ నేతలు మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనే ప్రజలు వారికి గట్టి బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. అహంకారపూరిత వైఖరిని వీడి, ప్రజాస్వామ్య విలువల పట్ల కనీస గౌరవం కలిగి ఉండాలని హితవు పలికారు. తెలంగాణ సమాజం మార్పును ఆకాంక్షించిందని, నిరంకుశ పోకడలకు ఇక చోటు లేదని ఆయన స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించడం మానేసి, రాజకీయ క్రీడలు ఆడటం ఇక సాధ్యం కాదని ఘాటుగా హెచ్చరించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పట్ల గత ప్రభుత్వం

మిగతా 3లో..



## రామంతాపూర్ చెరువుపై హైడ్రా ఉక్కుపాదం

- 16 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది
- అక్రమ వాణిజ్య భవనం, ఆటో గ్యారేజీలను తొలగించారు
- గుడిసెల్లో ఉన్నవారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరుకు సిఫారసు
- మొత్తం 18 ఎకరాల్లో చెరువును పునరుద్ధరించాలని నిర్ణయం
- చెరువు అభివృద్ధికి రూ. 19 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- చెరువుల పరిరక్షణలో హైడ్రా దూకుడు కొనసాగిస్తోంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ మహానగరంలో చెరువుల పరిరక్షణే లక్ష్యంగా హైడ్రా దూకుడు ప్రదర్శిస్తోంది. అక్రమార్కుల చెరలో మగ్గుతున్న జలవనరులను కాపాడేందుకు ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలోనే తాజాగా రామంతాపూర్ పెద్ద చెరువు పరిధిలో ఆక్రమణలకు గురైన భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దశాబ్దాలుగా కబ్జాదారుల ఆధీనంలో ఉన్న చెరువు భూములను విముక్తి చేసే ప్రక్రియను హైడ్రా వేగవంతం చేసింది. నగరంలోని చెరువులు కనుమరుగవుతుండటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని గుర్తించిన ప్రభుత్వం, ఈ సంస్థను ఏర్పాటు చేసి కఠిన చర్యలకు ఉపక్రమించింది. రామంతాపూర్ పెద్ద చెరువు సుమారు 30 ఎకరాల ఎఫ్.టి.ఎల్ విస్తీర్ణాన్ని కలిగి ఉంది. అందులో 16 ఎకరాల వరకు పూర్తిగా కబ్జాదారుల వశమైంది. ఈ ప్రాంతంలో జరుగుతున్న

మిగతా 3లో..

## కొండెక్కిన కోడిగుడ్డు

- ఒక్కో కోడిగుడ్డు ధర రూ. 9కి చేరుకోవడంతో సామాన్యులపై భారం
- సోయాబీన్, మొక్కజొన్న వంటి దాణా ధరల భారీ పెరుగుదల
- పౌల్ట్రీ నిర్వహణ భారం రోజుకు అదనంగా సుమారు రూ. 1 లక్ష
- డీజిల్ ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరగడం
- కోళ్లలో ఇన్ఫెక్షన్ల వల్ల ఉత్పత్తిలో అంతరాయం
- డిమాండ్ లేని వర్షా కాలంలోనే ధరలు పెరగడం ఆందోళనకరం

02



# ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీబిజీ

- 2028 జూన్ నాటికి మామునూరు విమానాశ్రయం పూర్తికి విజ్ఞప్తి
- వరంగల్, ఆదిలాబాద్‌లో ఎయిర్‌కార్గో, ఎమ్మార్వో సదుపాయాల కల్పన
- పౌర విమానాశ్రయ ఏర్పాటుకు భూమిని కేటాయిస్తామన్న ప్రభుత్వం
- హైదరాబాద్-విజయవాడ మధ్య సీ-ప్లేన్ల ప్రతిపాదన
- భూసేకరణను వేగంగా పూర్తి చేసినందుకు కేంద్రం అభినందన
- కేంద్ర సహకారంతో రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగాల కల్పన



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా విమానయాన రంగాన్ని విస్తరించడం ద్వారా తెలంగాణను పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా అగ్రపథాన నిలపాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో భేటీ అయి, రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల కల్పనపై సమగ్రంగా చర్చించారు. ప్రత్యేకించి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలలో విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రాధాన్యత నిస్తూ, కేంద్రం నుంచి రావాల్సిన సహకారం గురించి విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని సాగించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి సైతం తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న చొరవను అభినందిస్తూ సానుకూలంగా స్పందించారు. ఈ భేటీ ద్వారా తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలు, రాష్ట్ర గమనాన్ని మార్చబోయే కీలకాంశాలు స్పష్టమయ్యాయి. ఉత్తర తెలంగాణాకు కేంద్ర బిందువుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ప్రయాణికులకు, వ్యాపారవేత్తలకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ ప్రాంగణంలో ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వంటి అత్యాధునిక వసతులను కల్పించవలసిందిగా కోరారు. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసినందున, ఇక జాప్యం లేకుండా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. 2028, జూన్ 2 నాటికి విమానాశ్రయాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వరంగల్ చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, కాకతీయ శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబించేలా విమానాశ్రయ డిజైన్లు ఉండాలని సీఎం ఆకాంక్షించగా, కేంద్ర మంత్రి అందుకు అంగీకారం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో రక్షణ శాఖ ఆధ్వర్యంలో విమానాశ్రయంతో పాటు పౌర విమానయాన సదుపాయాలను కూడా కల్పించాలని ముఖ్యమంత్రి కోరారు. అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి అప్పగిస్తుందని కేంద్ర మంత్రికి భరోసా ఇచ్చారు. వరంగల్ తరహాలోనే ఇక్కడ కూడా ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వంటి సదుపాయాలను నెలకొల్పడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి బాటలు పడతాయని వివరించారు. రెండు విమానాశ్రయాల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో విమాన శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఆదిలాబాద్ భౌగోళిక పరిస్థితులు, రక్షణ అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలని కోరారు. వ్యూహాత్మకంగా ఈ ప్రాంతం ఎంతో కీలకమని, తద్వారా స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో వరంగల్ నగరం ఇప్పటికే పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే రైలు, రోడ్డు మార్గాల అనుసంధానంతో పాటు రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ముఖ్యమంత్రి వివరించారు. రానున్న రోజుల్లో మరింత భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ విమానాశ్రయం కీలకపాత్ర పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ హుస్సేన్ సాగర్ నుంచి విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్లను నడిపే అద్భుతమైన ప్రతిపాదనను కూడా సీఎం కేంద్రం ముందుంచారు. ఈ వినూత్న ఆలోచన పట్ల కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి ప్రణాళికలు, సాధ్యాసాధ్యాలను నివేదిక రూపంలో సమర్పిస్తే, పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇది పర్యాటక రంగ అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న చొరవను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గట్టిగా ప్రశంసించారు. విమానాశ్రయాల అభివృద్ధికి దేశంలోని పలు రాష్ట్రాలు పోటీపడుతున్న ప్రస్తుత తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం రికార్డు సమయంలో భూసేకరణ పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి సమర్థవంతమైన పాలన దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భూసేకరణలో చూపిన వేగం, చిత్తశుద్ధిని చూస్తుంటే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయనే నమ్మకం కలుగుతోందని స్పష్టం చేశారు. వరంగల్ చారిత్రక ఘనతను, కాకతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా విమానాశ్రయ డిజైన్లు ఉంటాయని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రాల ప్రగతి కోసం కేంద్రం నిరంతరం కృషి చేస్తోందని, అభివృద్ధి పథంలో కలిసే నడుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల సమయానికే రాజకీయాలు పరిమితం చేయాలని, పరిపాలనాపరమైన అంశాలలో పార్టీలకతీతంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో విమానాశ్రయాల పాత్ర కీలకమని, తెలంగాణలో ఈ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని చెప్పారు. అభివృద్ధి పనుల కోసం కేంద్ర మంత్రులను కలవడం, సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీ పర్యటనలు చేయడం సహజమైన ప్రక్రియ అని ఆయన తెలిపారు. ఈ విషయంలో అనవసరమైన రాజకీయ విమర్శలు చేయడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. కేంద్రం తమకు సహకరిస్తోందని, సంయుక్త కృషితోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని ఆయన వివరించారు. అభివృద్ధి అజెండాను ముందుంచుకుని కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ముఖ్యమంత్రి మరోసారి స్పష్టంగా తెలిపారు. ఈ కీలక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులుగా రోడ్లు, భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ తమ వంతు సహకారం అందించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్ మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ విపిన్ కుమార్ తదితర ఉన్నతాధికారులు కూడా చర్చల్లో పాల్గొన్నారు. ప్రాజెక్టుల పురోగతి, నిధుల కేటాయింపు, సాంకేతిక అనుమతులపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశం తెలంగాణ అభివృద్ధి చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఆశించిన మేరకు నిధులు, అనుమతులు త్వరితగతిన లభిస్తాయనే నమ్మకంతో ప్రతినిధి బృందం ఉంది. తెలంగాణలో విమానయాన మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కావడానికి ఈ ఉన్నత స్థాయి భేటీ బలమైన పునాదిని వేసింది.

# కొండెక్కిన కోడిగుడ్డు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలో కోడిగుడ్ల ధరలు అనూహ్యంగా గగనతలాన్ని తాకుతున్నాయి. సామాన్య ప్రజలు దైనందిన ఆహారంలో తప్పనిసరిగా భాగం చేసుకునే ఈ నిత్యావసర ధర ఒక్కసారిగా ఎగబాకడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా శీతాకాలంలో పెరిగే డిమాండ్ దృష్ట్యా ధరల పెరుగుదల సంభవిస్తుంటుంది. అయితే ఇప్పుడు వర్షాకాలంలో కూడా ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం. ప్రస్తుతం ఒక్కో కోడిగుడ్డు ధర ఏకంగా ఎనిమిది నుంచి తొమ్మిది రూపాయల వరకు విక్రయిస్తుండటంతో మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న సామాన్యుడికి ఈ ధరల బాదుడు అశనిపాతంగా మారింది. ఆహార భద్రత విషయంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పౌల్ట్రీ రంగంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు వినియోగదారుడి జేబుకు చిల్లులు పెడుతున్నాయి. ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరగడం వల్లనే ఈ ధరల పెరుగుదల అనివార్యమైందని వ్యాపార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ధరలు దిగిరాకపోతే సామాన్యుడికి గుడ్డు దూరం కానుంది. పౌల్ట్రీ రంగంలో కీలకమైన దాణా ఖర్చులు అమాంతం పెరగడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. గతంతో పోలిస్తే ముడి సరుకుల ధరలు రెట్టింపు అయ్యాయి. కిలో సోయాబీన్ ధర గతంలో ముప్పై ఐదు రూపాయలు ఉండగా ప్రస్తుతం అరవై ఎనిమిది రూపాయలకు చేరింది. మొక్కజొన్న వంటి కీలకమైన దాణా దినుసుల ధరలు కూడా ఇరవై రూపాయల నుండి ఇరవై ఎనిమిది రూపాయల స్థాయికి చేరుకున్నాయి. గత కొద్ది నెలలుగా ఈ పెరుగుదల క్రమంగా సాగుతూ ఇప్పుడు అత్యున్నత స్థాయికి చేరుకుంది. దాణా సప్లై చైన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులు ఉత్పత్తిదారుల నడ్డి విరుస్తున్నాయి. రైతులు లాభాలు ఆశించడం పక్కన పెడితే కనీసం పెట్టుబడి రాని దుస్థితిలో పౌల్ట్రీ యజమానులు సతమతమవుతున్నారు. పెరిగిన ఖర్చుల భారాన్ని చివరికి వినియోగదారుడిపై వేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ నిత్యావసర ధరల పెరుగుదల సామాన్యుడి బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది. కోడిగుడ్ల ధరలు ఎందుకు పెరుగుతున్నాయో అర్థం చేసుకోవాలంటే పౌల్ట్రీ నిర్వహణ ఖర్చుల విశ్లేషణ అత్యవసరం. గుడ్లు పెట్టే ఒక కోడి రోజుకు సగటున వంద నుండి నూట పదిహేను గ్రాముల దాణా వినియోగిస్తుంది. లక్ష కోళ్లు ఉన్న ఒక పౌల్ట్రీలో రోజుకు పది టన్నుల మేర దాణా అవసరమవుతుందని లెక్కలు చెబుతున్నాయి. దీనివల్ల రోజువారీ నిర్వహణ ఖర్చులకు అదనంగా లక్ష రూపాయల వ్యయం పెరుగుతోంది. ఈ భారీ భారాన్ని భరించలేక యజమానులు ఉత్పత్తిని తగ్గించే పనిలో ఉన్నారు. నిరంతరం పెరిగిన రవాణా ఖర్చులు కూడా గుడ్ల ధరపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. డీజిల్ ధరల పెంపుతో పౌల్ట్రీ ఫారమ్ నుండి మార్కెట్లకు సరుకు రవాణా చేయడం భారంగా మారింది. ఈ రవాణా చార్జీల భారాన్ని అధిగమించే క్రమంలోనే చివరకు కోడిగుడ్ల ధరలు పెంచాల్సి వస్తుందని పౌల్ట్రీ యజమానులు తమ బాధను వెళ్లగక్కుతున్నారు. వైరల్ ఇన్ఫెక్షన్ల వ్యాప్తి వల్ల కోళ్లు చనిపోవడం ధరల పెరుగుదలకు మరో ప్రధాన కారణమైంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కోళ్లకు సోకుతున్న వ్యాధులు పౌల్ట్రీ యజమానులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒక్కసారి ఇన్ఫెక్షన్ సోకితే పెద్ద సంఖ్యలో కోళ్లు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇలా చనిపోయిన కోళ్ల స్థానంలో కొత్త కోళ్లు గుడ్ల ఉత్పత్తికి సిద్ధం కావాలంటే కనీసం రెండు నెలల సుదీర్ఘ సమయం పడుతుంది. ఈ ఉత్పత్తి గ్యాప్ వల్ల మార్కెట్‌లో గుడ్ల సరఫరాకు, డిమాండ్‌కు మధ్య భారీ అంతరం ఏర్పడుతోంది. ఈ కొరత వల్లనే ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. వ్యాధి నివారణకు చేసే ఖర్చులు కూడా పౌల్ట్రీ యజమానులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఆరోగ్యపరమైన సవాళ్లు పౌల్ట్రీ పరిశ్రమను అతలాకుతలం చేస్తున్నాయి. గుడ్ల ఉత్పత్తిలో వచ్చిన ఈ తగ్గుదల ధరలను నియంత్రించలేని స్థితికి తీసుకువెళ్లింది.



# వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

## నీటి సంరక్షణపై అవగాహన.. మున్సిపల్ చైర్‌పర్సన్ షాబాద్ సోనియా

**మొయినాబాద్, జూలై 14 (విశాలభారతి):** వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు ప్రతి నీటి బొట్టును సంరక్షించాలని మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి షాబాద్ సోనియా దర్శన్ అన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారం ప్రభుత్వ జిల్లా పాఠశాలలో వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరతను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఇల్లు, ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ విభాగం అధికారులు, ఈఈ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# సివిల్స్ ఉచిత కోచింగ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్రంలోని బీసీ అభ్యర్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకుంది. యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించే అభ్యర్థులకు ఇది ఒక గొప్ప అవకాశం. బీసీ ఉపాధి శిక్షణాభివృద్ధి సంస్థ ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించాలని నిర్ణయించారు. 2027 సివిల్స్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఆగస్టు 24వ తేదీ నుంచి 2027 మే వరకు సుదీర్ఘకాలం ఈ కోచింగ్ కొనసాగుతుంది. నిరుపేద అభ్యర్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తూనే అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ఎంపికైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కలలను నిజం చేసుకునే దిశగా అడుగులు వేయాలి. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయం ఎంతో ప్రయోజనకరం. ఈ శిక్షణ కార్యక్రమం కింద మొత్తం 150 మంది అభ్యర్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో 50 సీట్లను ఇప్పటికే యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షలో విజయం సాధించి మెయిన్స్ కోసం సిద్ధమవుతున్న వారికి కేటాయిస్తారు. వీరికి ఎటువంటి ప్రవేశ పరీక్ష ఉండదు, కేవలం ప్రిలిమ్స్ క్వాలిఫై అయిన కార్డును చూపిస్తే సరిపోతుంది. మిగిలిన 100 సీట్ల కోసం ప్రభుత్వం పారదర్శకంగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారినే ఎంపిక చేసి కోచింగ్ ఇవ్వనున్నారు. అత్యంత అనుభవం ఉన్న నిపుణులైన ఫ్యాకల్టీతో సబ్జెక్టుల వారీగా లోతైన బోధన జరగనుంది. ప్రతి వారం క్రమం తప్పకుండా మాక్ టెస్టులు నిర్వహిస్తూ అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. నిపుణుల సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు అందిస్తూ అభ్యర్థులను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దడానికి అధికారులు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేశారు. సివిల్స్ లక్ష్యంగా పనిచేసే అభ్యర్థులకు ఇది ఎంతో కీలకం. అభ్యర్థుల ఆర్థిక ఇబ్బందులను అధిగమించేలా ప్రభుత్వం అద్భుతమైన ప్రోత్సాహకాలను ప్రకటించింది. కోచింగ్ తీసుకునే ప్రతి అభ్యర్థికి ప్రతి నెలా ఐదు వేల రూపాయల స్టైఫండ్ అందిస్తారు. దీనితో పాటు అవసరమైన పుస్తకాలను కొనుగోలు చేసుకోవడానికి అదనంగా ఐదు వేల రూపాయల మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తారు. ఈ నగదు సాయం అభ్యర్థులు తమ చదువుపై పూర్తి దృష్టి సారించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యుత్తమ గ్రంథాలయ సౌకర్యం, నిపుణులైన మార్గదర్శకత్వం ఇక్కడ అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు తమ వ్యక్తిగత ఖర్చుల గురించి ఆందోళన చెందకుండా లక్ష్య సాధనలో ముందుకు సాగవచ్చు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కూడా ఈ వసతులు గొప్ప ఊరటను ఇస్తాయి. లక్ష్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన అన్ని రకాల మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించడంతో అభ్యర్థుల సన్నద్ధతకు ఎటువంటి ఆటంకాలు ఉండవు. శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు ప్రభుత్వం విధించిన కొన్ని కఠినమైన అర్హతలను కచ్చితంగా కలిగి ఉండాలి. యూపీఎస్సీ నిబంధనల ప్రకారం డిగ్రీ విద్యార్హత తప్పనిసరిగా ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారు అయితే ఒకటిన్నర లక్షల రూపాయలకు, పట్టణ ప్రాంతాల వారు అయితే రెండు లక్షల రూపాయలకు మించకూడదు. ప్రస్తుతం ఏ రకమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉండకూడదు, ఇతర కోర్సులలో చదువుతున్న వారు ఈ దరఖాస్తుకు అనర్హులు. కేవలం సివిల్స్ పరీక్షల ప్రిపరేషన్‌కే పూర్తి సమయాన్ని కేటాయించే అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన కోచింగ్ కార్యక్రమాలలో ఎప్పుడూ పాల్గొని ఉండకూడదు.

# ఎన్నికల వరకు కాళేశ్వరమేనా..?



**మొదటి పేజీ తరువాయి**

రైతులకు ప్రయోజనం చేకూర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఎదురయ్యే ముప్పు ఉన్నందున పంపులను తక్షణమే ప్రారంభించాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రైతుల ప్రయోజనాలే తమకు పరమార్థమని వారు నమ్మబలుకుతున్నారు. ప్రాజెక్టు వైఫల్యంపై వస్తున్న ఆరోపణలను వారు తోసిపుచ్చుతున్నారు. సాంకేతిక లోపాలను సరిదిద్ది ప్రాజెక్టును నిరంతరం నడపడమే మార్గమని బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగా కోరుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ దర్యాప్తు వేగవంతం చేస్తోంది. నిపుణుల సూచనలు, డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను అప్పటి ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకులు బలంగా చెబుతున్నారు. మేడిగడ్డ బ్యారేజీలో నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని సాంకేతిక నిపుణులు స్పష్టంగా హెచ్చరించారని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. ప్రాజెక్టు లేకున్నా రాష్ట్రం వ్యవసాయ రంగంలో విజయవంతంగా ముందుకు సాగిందని, రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు సాధించామని వారు గర్వంగా పేర్కొంటున్నారు. కాళేశ్వరం నిర్మాణం ప్రజల సొమ్ము దుర్వినియోగమని వారు నిరంతరం విమర్శిస్తున్నారు. అవినీతికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. ప్రాజెక్టులో జరిగిన లోతైన తప్పులను వెలికితీసి బాధ్యులను కఠినంగా శిక్షించాలనే పట్టుదలతో ప్రస్తుత సర్కారు అడుగులు వేస్తోంది. కేటీఆర్ కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనతో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారాయని రాజకీయ వర్గాలు గమనిస్తున్నాయి. కేటీఆర్ పర్యటన తర్వాత ఈ అంశంపై చర్చ తీవ్రరూపం దాల్చింది. హరీశ్‌రావుకు ప్రాజెక్టుపై లోతైన అవగాహన ఉన్నప్పటికీ కేటీఆర్ ముందుండటం పార్టీలో కొత్త చర్చకు తెరలేపింది. ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని కేటీఆర్ డిమాండ్ చేయడం వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయని పరిశీలకుల భావన. కేసీఆర్ అసెంబ్లీలో స్వయంగా వివరణ ఇస్తేనే ఈ వివాదానికి ఒక ముగింపు లభిస్తుందని బీఆర్ఎస్ వర్గాలు ఆశిస్తున్నాయి. ఈ పర్యటనతో పాతబడిన చర్చ మళ్లీ ప్రాణం పోసుకుంది. అధికార పార్టీని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం చేస్తున్న ప్రయత్నాలు ఒకవైపు, తమ ప్రాజెక్టును రక్షించుకోవాలనే బీఆర్ఎస్ తాపత్రయం మరోవైపు కనిపిస్తోంది. కేటీఆర్ చొరవతో ఈ వ్యవహారం రాజకీయంగా మరింత వేడెక్కింది. రానున్న రోజుల్లో మరెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి. సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం అంశంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించేందుకు సిద్ధమని బహిరంగంగా సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రాజెక్టు లోపాలపై వివరణ ఇవ్వాలని ఆయన పట్టుపడుతున్నారు. అసెంబ్లీ వేదికగా కాళేశ్వరం వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజల ముందు ఉంచడం ద్వారా తమ పట్ల ప్రజల్లో ఉన్న సానుకూలతను పెంచుకోవాలని ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. ప్రతిపక్షం కూడా అసెంబ్లీలో తమ వాదనను గట్టిగా వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ సమావేశాలను రాజకీయ వేదికలుగా మార్చడంపై మేధావులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు నిజాలు చెప్పడం కన్నా పరస్పర దూషణలే ఎక్కువగా సాగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయా లేదా అన్న దానిపైనే ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కాళేశ్వరం వ్యవహారంలో బీజేపీ కూడా రంగంలోకి దిగి తనదైన శైలిలో విమర్శలు గుప్పిస్తోంది. ప్రాజెక్టు అవకతవకలపై చర్యలు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని బీజేపీ నేతలు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. కేంద్రంపై నిందలు వేయడం ఆపి సీబీఐ విచారణ వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సీబీఐ విచారణ కోరినా కేంద్రం స్పందించడం లేదని కాంగ్రెస్ ఆరోపించడంపై బీజేపీ కౌంటర్ ఇస్తోంది. కేంద్రం నిర్ణయం ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలను వెలికితీయడంలో బీజేపీ తనదైన పాత్ర పోషించాలని చూస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న ఈ పోరులో బీజేపీ తనకంటూ ఒక స్థానాన్ని వెతుక్కుంటోంది. మొత్తంగా ఈ ముక్కోణపు పోరు రాష్ట్ర రాజకీయాలను ఒక దారిలోకి తీసుకురావడం లేదు. నిందలు, ప్రతినిందలు రాజ్యమేలుతున్న ఈ వేళ ప్రజలు అసలు నిజాన్ని కోరుకుంటున్నారు. ప్రాజెక్టు సాంకేతికంగా ఎంతవరకు ఉపయోగపడుతుందో, నీటిని నిల్వ చేయడం సాధ్యమా అనే అంశాలను నిపుణులు తేల్చాల్సి ఉంది. కానీ రాజకీయ పార్టీలు మాత్రం దీనిని ఎన్నికల ప్రచార అస్త్రంగా వాడుకుంటున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు కాళేశ్వరం చుట్టూ ఈ రాజకీయ వేడి కొనసాగుతుందా లేక త్వరలోనే దీనికి ముగింపు లభిస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. రైతుల ప్రయోజనాలను విస్మరించి రాజకీయాలు చేయడం వల్ల ఎవరికీ లాభం లేదని గుర్తించాలి. ప్రాజెక్టు లోపాలు నిజమైతే నిపుణుల కమిటీ ద్వారా పరిష్కారాలు చూపడం ప్రభుత్వ బాధ్యత. రాజకీయ నేతలు సమస్య పరిష్కారం కంటే గెలుపోటములపైనే దృష్టి పెట్టడం విచారకరం. శాస్త్రీయ దృక్పథంతో సమస్యను పరిష్కరించడం ద్వారానే ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవచ్చు. తెలంగాణ సాగునీటి రంగంలో ఈ ప్రాజెక్టు పాత్ర ఎంతటిదో కాలమే నిర్ణయించాలి. వివాదాలకు ముగింపు పలకడమే ఉత్తమ మార్గం.

# ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాలోని సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) ప్రాజెక్టులను పరిశీలించడంతో పాటు నిర్వహించనున్న సమీక్ష సమావేశం నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అవసరమైన భద్రతా ప్రమాణాలు, బారికేడింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, రాకపోకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అమ్మగారిపల్లి వద్ద నిర్వహించనున్న సమీక్ష సమావేశం ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. సమావేశ వేదిక, అధికారుల, ప్రజాప్రతినిధుల కూర్చునే ఏర్పాట్లు, మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన, సమీక్ష సమావేశం విజయవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, ధన్యవాదాలు ఎంపీడీవో ముత్యాలరావు, నీటిపారుదల శాఖ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆగస్టులోనూ తిప్పలు..!

**మొదటిపేజీ తరువాయి**

ఐఎండీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, సీఆర్ఐడీఏ ప్రతినిధులు పాల్గొని క్షేత్రస్థాయి పరిస్థితులపై లోతైన విశ్లేషణ చేశారు. ప్రధానంగా రాష్ట్రంలోని 20 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదు కావడంతో పరిస్థితి తీవ్రంగా ఉందని గుర్తించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మూడు దశల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. కరువు ఛాయలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండలాలవారీగా వీక్లీ వెదర్ బులెటిన్‌లు జారీ చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. క్షేత్రస్థాయిలో కంటింజెన్సీ ప్రణాళికలను కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్ నినో సవాల్‌ను ఎదుర్కోవడానికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు దీర్ఘకాలిక డ్రై స్పెల్స్, అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేశారు. జూలై 15 వరకు వర్షాలు కురవకపోతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు అంచనా వేశారు. విత్తనాల కొరత లేకుండా ముందుగానే నిల్వలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. కేవలం 13 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో వర్షాల కోసం నిరీక్షణ తప్పడం లేదు. విత్తన పంపిణీలో పారదర్శకత పాటిస్తూ రైతాంగానికి భరోసా కల్పించేందుకు వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను రంగంలోకి దించింది. విత్తనాల నిల్వలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సకాలంలో పంపిణీ చేసేలా ప్రణాళికలను రూపొందించారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి డైనమిక్ డిస్ట్రిక్ట్ స్పెసిఫిక్ రెస్పాన్స్ పద్ధతిని అమలు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రియల్ టైమ్ వర్షపాతం పర్యవేక్షణ, నేలలో తేమ పరిశీలన, వాతావరణ ఆధారిత సలహాలు, పంటల ఎదుగుదల అంచనాలు వంటి కీలక అంశాలను ఈ విధానంలో పొందుపరిచారు. వాతావరణ శాఖ, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. ప్రతి వారం మండలాలవారీగా అగ్రోవెదర్ బులెటిన్లను విడుదల చేయడం ద్వారా రైతులకు సకాలంలో సమాచారం అందుతుంది. రైతు వేదికలు, గ్రామపంచాయతీల ద్వారా సమాచార



మార్పిడిని వేగవంతం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల వినియోగంతో ప్రతి రైతుకు వాతావరణ హెచ్చరికలు చేరవేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పంటల వైవిధ్యీకరణ, నేల తేమ సంరక్షణ పద్ధతులపై అవగాహన పెంచుతున్నారు. అన్ని శాఖల భాగస్వామ్యంతో డీఎస్‌ఆర్ విధానం ద్వారా రైతులకు సంక్షోభ సమయంలో అండగా నిలవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆగస్టు నెలాఖరు వరకు వారానికోసారి విడుదల చేసే బులెటిన్‌లో వర్షపాతం అంచనాలు, డ్రై స్పెల్స్ అవకాశాలు, ఉష్ణోగ్రతలు, నేల తేమ, భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితిగతులను వివరిస్తారు. రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు, ప్రాజెక్టుల వారీగా నీటి లభ్యత వంటి ముఖ్యమైన సమాచారాన్ని పొందుపరుస్తారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు దిశానిర్దేశం చేస్తారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా వాతావరణ సమాచారాన్ని నిరంతరం పంచుకుంటారు. పంటలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తారు. కరువు పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం అత్యంత కీలకం. ప్రాజెక్టుల నీటి నిల్వల ఆధారంగా పంటల ప్రణాళికలను మార్చుకోవాలని సూచిస్తున్నారు. రైతుల ఆదాయాన్ని కాపాడటమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ బులెటిన్ వ్యవస్థను పకడ్బందీగా రూపొందించింది. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో సమాచార ప్రసారాన్ని విస్తృతం చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సాగులో ఆధునిక పద్ధతులను పాటించాలని శాస్త్రవేత్తలు సూచించారు. వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు వేయాలని, భూమిలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. పొలాల్లో తేమ సంరక్షణకు బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ్ ఫరో సాగు పద్ధతులు ఉత్తమమని తెలిపారు. నేల తేమ ఆరిపోకుండా ఉండేందుకు అంతర కృషి చేయాలని సూచించారు. ఎరువులను అవసరమైనప్పుడే వివేచనతో ఉపయోగించడం వల్ల ఖర్చులు తగ్గుతాయి. నీటి ఎద్దడిని తట్టుకునేందుకు స్కిప్ రో ఇరిగేషన్ పద్ధతిని అమలు చేయడం ప్రయోజనకరం. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నప్పుడు యూరియా లేదా పొటాషియం నైట్రేట్ ద్రావణాలను ఆకులపై పిచికారీ చేయాలని సిఫార్సు చేశారు. వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రధాన పంటలతో పాటు అంతర పంటలను ప్రోత్సహించడం వల్ల రైతులకు లాభదాయకంగా మారుతుంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. వరి సాగు చేసే రైతులు నారుమడుల్లో కార్బోఫ్యూరాన్ వినియోగం, దగ్గరగా నాట్లు వేయడం, అదనపు నత్రజని వాడకం, ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ పద్ధతిని అనుసరించాలని సూచించారు. నారు వేయని రైతులు తక్కువ వ్యవధిలో పండే రకాలతో డ్రై డైరెక్ట్ సీడెడ్ రైస్ పద్ధతిని ఎంచుకోవాలని తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద కూడా ఆరుతడి పంటలనే వేయాలని మంత్రి సూచించారు. భారీ ఇరిగేషన్ రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆశాజనకంగా లేవు. భారీ వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉన్నందున వరదలు స్వల్పంగానే ఉంటాయి. భూగర్భజలాలు త్వరగా ఇంకిపోతున్నందున బావుల, బోర్ల కింద చిరుధాన్యాలు, తక్కువ నీటి వినియోగం కలిగిన పంటలను సాగు చేయాలని తుమ్మల పిలుపునిచ్చారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే రకాలను ఎంపిక చేసుకోవడం ప్రస్తుతం ఉన్న ఏకైక మార్గం. ప్రభుత్వ సలహాలను పాటిస్తూ పంటలను కాపాడుకోవాలని కోరుతున్నారు. సాగులో వైవిధ్యం ప్రదర్శించటం ద్వారానే వర్షాభావ పరిస్థితులను అధిగమించవచ్చునని నిపుణులు నొక్కి చెబుతున్నారు. నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాల్సిన సమయం ఇది. వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు సాంకేతిక సాయం అందించాలి. కరువును జయించేందుకు ప్రభుత్వ యాక్షన్ ప్లాన్ విజయవంతం కావాలంటే ప్రతి రైతు సహకారం అవసరం. పంటల భీమా, ఆర్థిక సాయం విషయంలోనూ ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. ఆరుతడి పంటల వైపు మళ్లడం ద్వారా భూగర్భ జలాలను పొదుపు చేసుకోవచ్చు.

## కూనంనేనిపై ఫిర్యాదు వార్త పూర్తిగా అవాస్తవం

- 10టీవీ ఛానల్లో వచ్చిన దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నా.
- ఎస్ఐఆర్ ప్రక్రియపైనే మీనాక్షితో చర్చించాం.
- కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాం.
- ప్రభుత్వంలో సిపిఐ, కాంగ్రెస్ కలిసి ఉన్నాయి.
- ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి



పాల్వంచ విశాల భారతి : శాసనసభ సభ్యులు, గౌరవ కూనంనేని సాంబశివరావుపై తాను కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు 10టీవీ ఛానల్‌లో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తమని, సదరు దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వార్త ఛానల్లో ప్రసారమైన వార్తలపై మంగళవారం అయన వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని ఇసుక దందాలు, భూకబ్జాలు చేస్తున్నారని తాను ఫిర్యాదు చేసినట్లు సదరు ఛానల్‌లో ప్రసారం చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కేవలం కాంగ్రెస్ ఎంపీలను పిలిపించి ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి మాత్రమే వివరణ తీసుకున్నారని ఎంపీ రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వివరాలు సేకరించారని, అందులో భాగంగానే తాము కూడా పాల్గొన్నామని తెలిపారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ప్రోగ్రెస్ రిపోర్ట్, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే తాము మీనాక్షి నటరాజన్‌కు కూలంకషంగా వివరించామని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి తప్పుడు వార్త ప్రసారం చేయించారని ఆరోపించారు.

# 'బావ-బామ్మర్దుల' ఆటలు ఇక సాగవు

**మొదటిపేజీ తరువాయి**



ప్రదర్శించిన నిర్లక్ష్యాన్ని భట్టి తీవ్రంగా తప్పుబట్టారు. కేవలం భూమి పూజలకే పరిమితమై, ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో సాగునీరు అందించే ప్రయత్నం చేయలేదు. ప్రాజెక్టును గాలికి వదిలేసి, భూసేకరణకు నిధులు కేటాయించకుండా రైతులను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. మొదలుపెట్టిన పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం ద్వారా జిల్లా రైతాంగం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. ప్రాజెక్టుల పురోగతిపై కనీస చిత్తశుద్ధి లేని వారు నేడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. పనుల నిర్వహణలో వైఫల్యం చెంది, ప్రజల ఆశలను నీరుగార్చిన తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను గుర్తించకుండా తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని ఆయన బీఆర్ఎస్ నాయకులకు స్పష్టమైన సంకేతాలు పంపారు. నార్లపూర్ నుండి ఉదండాపూర్ వరకు పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామని భట్టి విక్రమార్క గంభీరమైన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి, ఇప్పటికే అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించారని వెల్లడించారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఎన్ని వందల కోట్ల నిధులైనా సరే వెనుకాడకుండా విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. పనులను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందని, రైతుల సాగునీటి కష్టాలను తీర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రకటించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా తీసుకెళ్తోందని ఆయన ఉద్ఘాటించారు. పాలమూరు సస్యశ్యామలం కావడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం సమగ్ర ప్రణాళికతో పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సామాజిక భద్రతకు, ఆర్థిక భరోసాకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. కాంగ్రెస్ అంటేనే ఉచిత విద్యుత్ అని, దీనికి పేటెంట్ హక్కు తమ పార్టీదేనని ఆయన గర్వంగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని ముప్పై లక్షల వ్యవసాయ పంపు సెట్లకు అంతరాయం లేని విద్యుత్తును అందిస్తున్నామని, ఇందుకోసం ఏటా పద్నాలుగు వేల కోట్ల రూపాయలను ప్రభుత్వమే డిస్కమ్‌లకు చెల్లిస్తోందని లెక్కలతో సహా వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు అరవై ఏడు వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశామని ఆయన గుర్తు చేశారు. కోటి ఆరు లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని ఆయన సగర్వంగా చెప్పారు. గద్వాల నియోజకవర్గానికి అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను సమకూర్చే బాధ్యత తమదేనని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. గత పాలకులు నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులను పునరుద్ధరించి, సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి గ్రామానికి నీరు, ప్రతి ఇంటికి వెలుగు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గ స్థాయి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, ప్రజల అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని భరోసా కల్పించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పాలన సాగుతోందని, తమపై నమ్మకం ఉంచాలని ప్రజలను ఉద్దేశించి ఆయన కోరారు. ప్రతిపక్ష నాయకులైన బావబామ్మర్దుల తీరుపై భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వస్తున్నాం, వస్తున్నాం అంటూ ఊరికే ప్రకటించడం తప్ప, ప్రజల కోసం చేసిన మేలు ఏమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. అసలు పార్టీ నాయకుడు ఎక్కడ ఉన్నారో తెలియని స్థితిలో వారు ఉన్నారని, ఇక ప్రజలను ఎలా మోసం చేస్తారని ప్రశ్నించారు. బావబామ్మర్దులకు గతం లేదు, భవిష్యత్తు లేదని, వారి మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని తేల్చి చెప్పారు.

## రామంతాపూర్ చెరువుపై
# హైడ్రా ఉక్కుపాదం



**మొదటిపేజీ తరువాయి**

ఆక్రమణలపై నిరంతరం వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న హైడ్రా, సమగ్ర సర్వే నిర్వహించి భూముల వివరాలను సేకరించింది. రామంతాపూర్ పెద్ద చెరువు మొత్తం 30 ఎకరాల విస్తీర్ణంలో 16 ఎకరాలు అక్రమ నిర్మాణాలతో నిండిపోయింది. ఆ 16 ఎకరాలలో దాదాపు 12 ఎకరాల స్థలంలో భారీ శాశ్వత కట్టడాలు వెలిశాయి. గతంలోనే వీటిని అడ్డుకోవాల్సిన స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇవి పుట్టగొడుగుల్లా పెరిగిపోయాయి. భారీ వాణిజ్య భవనాలు, బహుళ అంతస్తుల కట్టడాలు చెరువు గర్భంలోనే నిర్మితమయ్యాయి. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు చెలరేగిపోయారు. తాజాగా రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు ఈ అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాయి. మరో నాలుగు ఎకరాల భూమిలో చిన్నపాటి గుడిసెలు, తాత్కాలిక షెడ్లు వెలిశాయి. పేద ప్రజల ఆశ్రయంగా మారిన ఈ షెడ్ల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించిన అధికారులు, వారిని ఖాళీ చేయించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపునకు సిఫారసు చేశారు. హైడ్రా అధికారులు రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి కోసం ఏకంగా 18 ఎకరాలను సిద్ధం చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే భారీ వాణిజ్య భవనాలపై దృష్టి సారించారు. సుమారు 1900 గజాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న జీ ప్లస్ 2 భవనాన్ని అధికారులు కూల్చివేశారు. అలాగే అదే పరిధిలో ఉన్న 280 గజాల విస్తీర్ణంలోని ఆటో గ్యారేజీని కూడా నేలమట్టం చేశారు. చెరువు గర్భంలో ఉన్న ప్రతి అంగుళాన్ని కబ్జాదారుల నుంచి విముక్తి చేయాలనే పట్టుదలతో హైడ్రా పనిచేస్తోంది. ఎంతటి ప్రభావశీలురైనా చట్టం ముందు సమానమేనని నిరూపిస్తూ అక్రమ కట్టడాలను తొలగిస్తున్నారు. భారీ యంత్రాలతో కూల్చివేతలు చేపడుతుంటే ఆక్రమణదారులు బెంబేలెత్తుతున్నారు. నిబంధనలను అతిక్రమించి చెరువు భూములను ఆక్రమించిన వారికి హెచ్చరికలు జారీ చేస్తూ, భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా నిఘాను మరింత కఠినతరం చేశారు అధికారులు. సుమారు 19 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని హైడ్రా నిర్ణయించింది. చెరువును సుందరీకరించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రణాళికలు రూపొందించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పచ్చని పార్కులను ఏర్పాటు చేసి స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించనున్నారు. కబ్జాదారుల నుంచి విముక్తి పొందిన భూమిని చెరువు అభివృద్ధికి వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు జలవనరులను అందించే ప్రయత్నం చేస్తున్నారు. పూడికతీత పనులు చేపట్టడం ద్వారా వర్షపు నీరు ఎక్కువగా నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటారు. గతంలో చెరువును ఆక్రమించుకున్న వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూడా హైడ్రా యోచిస్తోంది. భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న వెంటనే అక్కడ చెరువు గుర్తులను ఏర్పాటు చేసి, ఫెన్సింగ్ వేసే పనులను కూడా అధికారులు వేగవంతం చేస్తున్నారు. చెరువుల పరిరక్షణ విషయంలో హైడ్రా తీసుకుంటున్న నిర్ణయాలు నగరవాసులలో నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. అక్రమంగా చెరువులను కబ్జా చేసి ప్లాట్లుగా అమ్మిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కూడా అధికారులు దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందిన భవనాలకు సంబంధించిన ఫైళ్లను కూడా హైడ్రా ఆరా తీస్తోంది. రాజకీయ పలుకుబడితో చెరువు భూములను తమ పేరుతో పట్టా చేసుకున్న వారి బాగోతాన్ని బయటపెట్టేందుకు సిద్ధమవుతోంది. రామంతాపూర్ పెద్ద చెరువు ఉదంతం కేవలం ఆరంభం మాత్రమేనని, నగరంలోని ప్రతి చెరువును ఇలాగే కాపాడతామని హైడ్రా స్పష్టం చేస్తోంది. అక్రమ కట్టడాల కూల్చివేతను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నించినప్పటికీ, ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పనులు కొనసాగిస్తున్నారు. చెరువు భూములను కాపాడటమే తమ ప్రాధాన్యత అని హైడ్రా అధికారులు పదేపదే చెబుతున్నారు. ఈ ప్రక్రియతో ఆక్రమణదారుల్లో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా హైడ్రా తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. చెరువుల ఎఫ్.టి.ఎల్ మరియు బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలను గుర్తించేందుకు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా గత పదేళ్లలో చెరువుల విస్తీర్ణం ఎంతవరకు తగ్గిందో స్పష్టంగా తెలుసుకుంటున్నారు. ఆ వివరాల ఆధారంగానే కూల్చివేతలు చేపడుతున్నారు. గతంలో ఈ భూములను చూసీచూడనట్లు వ్యవహరించిన అధికారులపై కూడా వేటు పడే అవకాశం ఉంది. రామంతాపూర్ పెద్ద చెరువును ఒక మోడల్‌గా మార్చాలని సంకల్పించిన హైడ్రా, ఆ ప్రాంతంలో పూర్తిస్థాయిలో హరితహారం కార్యక్రమం చేపట్టనుంది.

# ఈటల 'సింగరేణి భరోసా యాత్ర'

**మొదటిపేజీ తరువాయి**



లక్షా ఇరవై వేలకు పైగా ఉండగా ఇప్పుడు నలభై వేలకు పడిపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ నిర్వహణ లోపాలతో కార్మికుల ఉపాధి అవకాశాలు మరుగున పడటం బాధాకరమని పేర్కొన్నారు. సింగరేణిని పటిష్టం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఈటల స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సింగరేణి బలోపేతం కోసం ప్రత్యేక దృష్టి సారించారని ఈటల తెలిపారు. ఇందులో భాగంగానే తాడిచెర్ల బొగ్గు గనిని సింగరేణి సంస్థకు కేటాయించారని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రక్రియలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి చేసిన కృషి అభినందనీయమని ఆయన ప్రశంసించారు. బొగ్గు వెలికితీత ద్వారా సంస్థ ఆర్థిక స్థితిని మెరుగుపరచవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త గనుల కేటాయింపుతో ఉత్పత్తి పెరిగి సంస్థ లాభాల బాట పడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గత పాలకులు సింగరేణి సంస్థను నిర్లక్ష్యం చేయడం వల్లనే నేడు ఇటువంటి దుస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా కార్మికుల సంక్షేమం కోసం సంస్థను అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణికి అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందని ఈటల హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని గత పాలకుల విధానాల వల్ల సింగరేణి సంస్థ రోజురోజుకు బలహీనపడుతూ వెలవెలబోతోందని ఎంపీ ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ సరైన ప్రణాళికలు లేకపోవడంతో సంస్థ నష్టాల్లో కూరుకుపోయిందని ఆయన విశ్లేషించారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి లాభాల కోసం అక్రమాలకు పాల్పడటం వల్ల సంస్థ దెబ్బతిన్నదని ఆయన ఆరోపణలు చేశారు. సింగరేణి ప్రాంత ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణిని పునరుజ్జీవింపజేసి గత వైభవాన్ని తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. సంస్థను ప్రైవేటీకరించే ఆలోచన లేదని గతంలోనే కేంద్రం స్పష్టం చేసిందని ఆయన గుర్తు చేశారు. అపోహలను నమ్మవద్దని కార్మికులకు సూచించారు. సంస్థ క్షేమం కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని ఈటల రాజేందర్ స్పష్టమైన ప్రకటన చేశారు. సింగరేణి ప్రాంత ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న బొగ్గు గనుల రక్షణకు బీజేపీ కట్టుబడి ఉందని ఈటల మరోసారి స్పష్టం చేశారు. సంస్థ పరిధిలోని ప్రతి కార్మికుడికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. సింగరేణి భరోసా యాత్ర ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుంటున్నామని ఆయన వివరించారు. తాడిచెర్ల మైన్ ప్రారంభం సింగరేణి చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్త గనుల ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కుటుంబాలకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడంలో ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఆదర్శంగా ఉన్నాయని ఆయన కొనియాడారు. సంస్థను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈటల రాజేందర్ వెల్లడించారు. కార్మికుల పని పరిస్థితులను మెరుగుపరచడం సహా వారి పిల్లల విద్యావకాశాలను పెంచేందుకు చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. గనిలో ప్రమాదాలు జరగకుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సింగరేణి ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా కొత్త గనుల విస్తరణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా సంస్థ ప్రయోజనాల కోసం బీజేపీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. సంస్థ అభివృద్ధికి అడ్డుపడుతున్న ప్రతికూల శక్తులను ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. సింగరేణి కార్మికుల శ్రమను గౌరవించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో సింగరేణిని మరింత లాభదాయక సంస్థగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఈటల రాజేందర్ పునరుద్ఘాటించారు. గనుల కేటాయింపులో జాప్యం లేకుండా చూడాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాలు సంస్థకు మేలు చేస్తాయని ఆయన వివరించారు. బొగ్గు ఉత్పత్తిని పెంచడం ద్వారా సంస్థ ఆర్థిక పునాదులను పటిష్టం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు సింగరేణి వెలుగులు నింపుతుందని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సంస్థలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తామని ఆయన వెల్లడించారు. కార్మికుల జీతభత్యాల పెంపు విషయంలో కూడా అనుకూల నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తామని ఆయన చెప్పారు. సింగరేణి ప్రాంతం అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన భావిస్తున్నారు. బీజేపీ నాయకత్వంలో సింగరేణి సంస్థను మరింత శక్తివంతంగా మారుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చివరగా సింగరేణి భరోసా యాత్ర విజయవంతంగా సాగుతుందని ఈటల రాజేందర్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే బాధ్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి సంస్థను కాపాడుకునే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారమే తమ మొదటి ప్రాధాన్యతని ఆయన స్పష్టం చేశారు. తాడిచెర్ల మైన్ ప్రారంభోత్సవం సంస్థకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని గనులను సింగరేణికి కేటాయించేలా కేంద్రంతో మాట్లాడుతామని ఆయన హామీ ఇచ్చారు. సింగరేణిని ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. బొగ్గు గని కార్మికుల కష్టానికి తగ్గ ఫలితం దక్కేలా చూస్తామని ఆయన ముగించారు. సంస్థ అభివృద్ధిలో బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని ఈటల రాజేందర్ మరోసారి స్పష్టం చేశారు.

## ప్రేమావతిపేట్‌లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో విస్తృతంగా సార్ ఫారాల నమోదు

**రాజేంద్రనగర్,విశాల భారతి :**



రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ప్రేమావతిపేట్ గ్రామంలో ఈరోజు సార్ ఫారాల నమోదు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ తరపున ప్రతి బస్తిలో ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి, ఫారాలను నింపించడం జరిగింది. ఈ కార్యక్రమం పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు, రాజేంద్రనగర్ సీనియర్ నాయకుడు ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో సాగింది. పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామంలోని ప్రతి ఓటరిని చేరుకోవడానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్లకాడి చంద్రశేఖర్, గోల్కొండ లేవిరాజ్, కవ్వగూడెం జనార్ధన్, గౌతమ్, అనిల్ కుమార్, రాము, నరేష్, ఎరుకలి అశోక్, నవీన్, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమానికి మంచి స్పందన వ్యక్తం చేస్తూ స్వచ్ఛందంగా ఫారాలను నింపించారు. ప్రతి ఓటరికి సార్ ఫారం ప్రాముఖ్యతను నాయకులు వివరించి అవగాహన కల్పించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని పార్టీ నాయకులు తెలిపారు.



## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**ఎటపాక జనసేన పార్టీ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు**

**భద్రాచలం ,విశాల భారతి;**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు భుజానికి శస్త్రచికిత్స జరగడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ ఎటపాక జనసేన పార్టీ ఆధ్వర్యంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాల కోసం శ్రీ సీతారాములవారిని ప్రార్థించారు. అనంతరం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎటపాక జనసేన పార్టీ నాయకులు మారసు గంగాధర్, బొడ్డు ఆనంద్, కొమ్ము వెంకటేష్, గోవింద్ వెంకట్, ఓబినేని శివకృష్ణ, తంత్రపల్లి సత్యనారాయణ, మందా సాయి, గడ్డల ప్రవీణ్, మందా రాజేష్ కార్యకర్తలు, అభిమానులు మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎండీఏ 'చీఫ్' అక్రమాల సామ్రాజ్యం బట్టబయలు

**ఏసీబీ వేటలో వంద కోట్ల బినామీ బాగోతం**

**సైబరాబాద్ - విశాల భారతి**

ప్రజలకు సేవలు అందించాల్సిన బాధ్యత కలిగిన ఉన్నతాధికారి, పదవిని అడ్డుపెట్టుకొని కోట్లకు పడగలెత్తిన తీరును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) బట్టబయలు చేసింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) చీఫ్ ఇంజినీర్ బొమ్మినేని రవీందర్ తెలిసిన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలపై ఏసీబీ సిటీ రేంజ్ 1 అధికారులు అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం మంగళవారం తెల్లవారుజాము నుంచి రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది చోట్ల ఏకకాలంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. జగమంతా అవినీతిమయమైపోతోందా అనే రీతిలో సాగిన ఈ దాడుల్లో నిందితుడి నివాసం, కార్యాలయంతో పాటు ఆయన బంధువులు, సహచరులు, బినామీలకు చెందిన ఇళ్లపై ఏసీబీ బృందాలు విరుచుకుపడ్డాయి. ఈ సోదాల్లో లభించిన పత్రాలు, విలువైన వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ప్రభుత్వ రికార్డుల ప్రకారం రూ.9.24 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను అధికారులు గుర్తించారు. అయితే ప్రస్తుత మార్కెట్ విలువల ప్రకారం లెక్కిస్తే ఈ జగంలో ఈ ఆస్తుల విలువ వంద కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు.సోదాల్లో వెలుగులోకి వచ్చిన స్థిరాస్తుల వివరాలు విస్తుగొలుపుతున్నాయి.నిందితుడికి కొండాపూర్ మసీద్‌బండ ప్రాంతంలో రూ.3 కోట్ల విలువైన 300 చదరపు గజాల జీ+4 నిర్మిత భవనం ఉంది. అదేవిధంగా ఐటీ కారిడార్ పరిధిలోని నర్సింగి, నానక్‌రాంగూడ ప్రాంతాల్లో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు విలాసవంతమైన ఫ్లాట్లు ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం మోకిలా గ్రామంలోని మెడోస్‌లో రూ.1.33 కోట్ల విలువైన 300 చదరపు గజాల అర్ధ నిర్మిత విల్లా కూడా ఉంది. వీటితో పాటు కొండకల్, కిష్టాపూర్, పసుమాముల ప్రాంతాల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ఓపెన్ ప్లాట్లు, రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం గుదూరు గ్రామంలో రూ.6 లక్షల విలువైన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు దస్తావేజుల ద్వారా తేలింది. ఈ విధంగా స్థిరాస్తుల మొత్తం విలువ రూ.6.85 కోట్లకు చేరుకుంది. చరాస్తుల్లో కూడా భారీగా ఆస్తులు బయటపడ్డాయి. నిందితుడి వద్ద నుంచి రూ.1.16 కోట్ల విలువైన నాలుగు లగ్జరీ కార్లను ఏసీబీ అధికారులుగణించారు. వాటిలో ఇన్నోవా హైక్రాస్, టాటా సఫారీ, ఇన్నోవా క్రిస్టా, మహీంద్రా ఎక్స్‌యూవీ వంటి ఖరీదైన వాహనాలు ఉన్నాయి. ఇల్లాలు, కుటుంబ సభ్యుల పేరిట రూ.36.7 లక్షల విలువైన 1,440 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల విలువైన 12.5 కిలోల వెండి వస్తువులు లభించాయి. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.45.05 లక్షల నిల్వలు, నివాసంలో రూ.3.82 లక్షల నగదు, రూ.17.24 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.9.32 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు, ఐప్యాడ్, ట్యాబ్లు, హార్డ్‌డిస్క్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా అధికారులు గుర్తించారు. వీటన్నింటిని కలిపితే చరాస్తుల విలువ రూ.2.38 కోట్లుగా తేలింది.ఈ ఆస్తులన్నీ ఒక్క రవీందర్ పేరిట మాత్రమే కాకుండా, బినామీలు, బంధువులు, సన్నిహితుల పేర్లతో ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఇంకా కొన్ని బ్యాంకు లాకర్లు తెరవాల్సి ఉందని, ఆర్థిక లావాదేవీలపై లోతైన దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు. సోదాలు పూర్తయిన అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు, హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయస్థాన నిర్బంధానికి హాజరుపరచనున్నారు.



హెచ్‌ఎండిఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు



రవీందర్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న గదు, నగలు



# ఇబ్రహీంపట్నం ఆరోగ్య రంగానికి కొత్త దిశ

- ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతానికి సమగ్ర కార్యాచరణ
- శనివారంలోగా నివేదిక ఇవ్వాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం
- పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యమన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్,విశాల భారతి :**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, వైద్యుల లభ్యత, సిబ్బంది కొరత, మౌలిక వసతులు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమగ్ర నివేదికను శనివారంలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజలు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పొందేలా చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. అందులో భాగంగా ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ స్థాయికి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తాత్కాలికంగా కొనసాగుతున్న ఆస్పత్రిలో కూడా అదనపు వైద్య సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు.నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, పేద రోగులు బయట మందులు కొనుగోలు చేసే పరిస్థితి రాకూడదని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరై బాధ్యతాయుతంగా సేవలు అందించాలని సూచించారు.బస్తీ దవాఖానాలను మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని, అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్యూటీ వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు, గర్భిణులకు పోషకాహారం, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసాన్ని మరింత పెంచేలా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీతా సత్యనారాయణ, ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్, వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ నరేందర్ కుమార్, రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణకుమారి రెడ్డి, డీసీహెచ్ఎస్ అనురాగిణి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పేదరికానికి చెక్.. ప్రతిభకు చేయూత

- ఎస్సెస్సీ టాపర్ ఉన్నత విద్యకు పూర్తి భరోసా ఇచ్చిన విజయ్
- ఎలక్ట్రికల్స్ సీఎండీ దాసరి జై రమేష్

**మోటకొండూరు, విశాల భారతి:**

ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదనే సంకల్పంతో విజయ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ దాసరి జై రమేష్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 202526 ఎస్సెస్సీ పరీక్షల్లో 534 మార్కులు సాధించిన పేద, ప్రతిభావంతుడైన విద్యార్థి ఇంజ ప్రవీణ్ ఉన్నత విద్యకు పూర్తి అండగా నిలిచారు. విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా అతని చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని ఆచంట భాగ్యశ్రీ, శ్రీనివాస చక్రవర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురాం రెడ్డి కలిసి విద్యార్థి పరిస్థితిని దాసరి జై రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యాభ్యాసానికి అవసరమైన కాలేజీ ఫీజులు, హాస్టల్ వసతి, భోజనం, పుస్తకాలు సహా అన్ని విద్యా సంబంధిత ఖర్చులను పూర్తిగా భరించనున్నట్లు ప్రకటించారు. విద్యే సమాజాభివృద్ధికి బలమైన పెట్టుబడి అనే నమ్మకంతో అందించిన ఈ సహాయం పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని విద్యావేత్తలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఇది గొప్ప ప్రోత్సాహంగా మారుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీమతి వంగాల నిఖిత మహేందర్, ఏపీపీసీ సభ్యురాలు వంగపల్లి సిద్ధమ్మ శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు దాసరి జై రమేష్ సేవా దృక్పథాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

- ఎంత మొరపెట్టుకున్న పట్టించుకోని విద్యుత్ అధికారులు
- ఫిర్యాదు దారులు మాజీ సర్పంచ్ బోడ కృష్ణ



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండల పరిధిలోని నకర్త మేడిపల్లి గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు చేతికి అందే విధంగా ఉన్నాయని వ్యవసాయ రైతు బోడ కృష్ణ, సర్వేనెంబర్ 294లో పొలంలో దున్నేటప్పుడు, వరి నాట్లు వేసే సమయంలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని, ఆ ప్రాంత వ్యవసాయ రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. గత సంవత్సరం నుండి విద్యుత్ అధికారులకు చెప్పిన స్పందించడం లేదని, ఆ విద్యుత్ వైర్ల తీగలతో ఎవరికి ఏ ప్రమాదం జరిగిన విద్యుత్ అధికారులు బాధ్యతని, వెంటనే అధికారులు స్పందించి ఈ విద్యుత్ తీగలను సరి చేయాలని బోడ కృష్ణ కోరారు

# మల్లఖంబ్‌తో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం

- జెడ్పీహెచ్ఎస్ బాటసింగారంలో ప్రత్యేక శిక్షణ
- శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందింపే లక్ష్యం

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో విద్యార్థులకు భారతదేశపు ప్రాచీన క్రీడా సంప్రదాయమైన మల్లఖంబ్‌లో ప్రత్యేక శిక్షణ విజయవంతంగా కొనసాగుతోంది. పాఠశాల శారీరక విద్య ఉపాధ్యాయుడు డా. సోలపోగుల స్వాములు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ విద్యార్థుల్లో విశేష ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, శరీర సమతుల్యత, ఏకాగ్రత, ధైర్యం, ఆత్మవిశ్వాసం గణనీయంగా పెంపొందుతున్నాయి. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటూ మల్లఖంబ్‌లోని వివిధ విన్యాసాలను నేర్చుకుంటూ క్రమశిక్షణ, సమన్వయం, జట్టు స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. జిమ్నాస్టిక్స్, యోగా, సంప్రదాయ వ్యాయామ విధానాల సమ్మేళనమైన మల్లఖంబ్ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడటమే కాకుండా భారతీయ క్రీడా వారసత్వంపై అవగాహన పెంచుతూ ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రేరణనిస్తోందని ఉపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఈ. నవీన్ నికోలస్, ఐఏఎస్ ప్రత్యేకంగా అభినందించారు. మల్లఖంబ్ వంటి సంప్రదాయ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి ఎంతో దోహదపడతాయని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సహనం, జట్టు భావన వంటి విలువలను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న శారీరక విద్య ఉపాధ్యాయుడు డా. సోలపోగుల స్వాములను, ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను అభినందించారు. డా. సోలపోగుల స్వాములు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ప్రోత్సాహం అందించిన పాఠశాల విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో మల్లఖంబ్ శిక్షణను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోందని పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష తెలంగాణ అధికారులు పేర్కొన్నారు.





## రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు

# వినతి పత్రం అందజేత



**తిరుమలగిరి,విశాల భారతి**

మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి ఎమ్మార్వో కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్లంల యాదగిరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయిందని,వరికి ప్రత్యామ్నాయ మెట్ట పంటలను సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా ఎకరాకు 8000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశించినంతగా ఇంకా వానలు పడటం లేదు.ఈ ఏడాది సేద్యం ఎలా వుంటుందనే భయ ఆందోళనలతో రైతులు పడిన కొద్ది వర్షాల కే పత్తి విత్తనాలు వేశారు. దాదాపు విత్తనాలు 30% మొలకెత్తలేదు. నకిలీ విత్తనాల బెడత వల్ల కొన్ని జిల్లాల్లో రైతులు యిబ్బందుల కు గురవుతున్నారు. 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మెట్ట పంటలకు అవసరమయ్యే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వరి పండిన పొలాలను మెట్ట పంటలకు మళ్ళించాలంటే అవసరమైన భూసారాన్ని పెంచడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని, మంచి దిగుబడి ఉండదని, పంటలకు మద్దతు ధరలు గ్యారెంటీగా అమలవుతాయా? అన్న సందేహాలతో రైతులు ఆందోళన పడు తున్నారన్నారు.వీటిని అధిగమించడానికి రైతులకు ధైర్యాన్ని ప్రోత్సాహాన్ని ఇవ్వటానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని,మెట్ట పంటలన్నింటికీ మద్దతు ధరలను గ్యారెంటీగా అమలు కావడానికి మార్కెట్ శక్తులను నియంత్రించాలని, అవసరమైతే మార్కెట్టు జోక్యం నిధులను కేటాయించి మద్దతు ధరలు అందేలా గా చర్యలు తీసుకోవాలన్నారు.రైతులు ధైర్యంగా భవిష్యత్తులో కూడా పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయటానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రైతు అనుకూల చర్యలను ప్రకటించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిప్పి రాల శ్రీకాంత్ , ఎస్ డి ఫయాజ్,కనుక అశోక్, జంపాల మల్లయ్య, నాగులగాని మల్లయ్య, మనోజ్ కుమార్, జంపాల నవీన్, గొలుసుల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడుకోండి



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను 4వ వార్డు సభ్యుడు మొగుళ్ల జీవన్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, పేరు సవరణ, చిరునామా మార్పు, ఇతర వివరాల సవరణకు సంబంధించిన విధానాన్ని ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మొగుళ్ల జీవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని అన్నారు. ప్రతి కుటుంబం తమ ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. కొత్తగా అర్హత పొందిన యువత వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదైన వారు తమ వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే నిర్ణీత గడువులోగా సవరించుకోవాలని కోరారు.ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కోల్పోతారని గుర్తు చేశారు. అందుకే ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రజలు హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి అవసరమైన ఫారాలను నింపడం, తమ సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మొగుళ్ల జీవన్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పరిశుభ్రతే మార్కెట్ లక్ష్యంగా చర్యలు

- ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం..
- రైతులు, వ్యాపారులు సహకరించాలని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి

**అబ్దుల్లాపూర్ మెట్ , విశాల భారతి :**

గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌లో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ యార్డును పూర్తిస్థాయిలో శుభ్రం చేయించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టినట్లు గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చిలుక మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా, చెత్త పేరుకుపోకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. రైతులు, వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలని, మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రమైన మార్కెట్ వల్ల రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, మెగావత్ గణేష్ నాయక్, చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, నాయకులు నవీన్, శేఖర్, సాయి, భార్గవ్, అనిల్‌తో పాటు పలువురు మార్కెట్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.







## ఎన్యూమరేషన్ ఫారంపై ఓటర్లకు అవగాహన..



**ఆలేరు, విశాల భారతి:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలేరు పట్టణంలోని 1వ వార్డు 190వ పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారంపై విస్తృత అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజని బాలమణి భాస్కర్ మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా నింపి ఓటరు జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల గిర్దావర్ భద్రయ్య, 1వ వార్డు కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్, 9వ వార్డు కౌన్సిలర్ పస్తం ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ దొనకొండ లాస్య కృష్ణ, బూత్ లెవల్ అధికారి మొరిగడి రమేష్, కాంగ్రెస్ నాయకులు శరబ్ కృష్ణ, బద్రోదీన్, బాబా, కొంగ రాకేష్, మద్దెల భాను, బోట్ల రాజేష్, బొడ్డు తరుణ్, మణి తదితరులు పాల్గొన్నారు.

## అలేరు అండర్‌పాస్‌తో రాకపోకలకు ఊరట

- పనులు పూర్తికావడంతో కౌన్సిలర్ సంపత్ పరిశీలన



**ఆలేరు, విశాల భారతి:** అలేరు పట్టణంలోని రైల్వే గేట్ వద్ద నిర్మించిన అండర్‌పాస్ బ్రిడ్జి పనులు పూర్తికావడంతో 5వ వార్డు కౌన్సిలర్ పసికంటి సంపత్ క్రాంతి నగర్ వాసులు, స్థానిక ప్రజలతో కలిసి మంగళవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా రైల్వే గేట్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యకు అండర్‌పాస్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఈ అండర్‌పాస్ ద్వారా విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర సేవల వాహనాలు ఇకపై ఎలాంటి అంతరాయం లేకుండా సురక్షితంగా ప్రయాణించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసిన అధికారులకు, సంబంధిత ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో అలేరు పట్టణ అభివృద్ధికి మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలను చేపట్టి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత కల్పించాలి

- సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు



**కురవి విశాల భారతి:** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం పని భద్రత కల్పించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. హమాలి వర్కర్స్ ఫెడరేషన్ సమావేశం కురవి మండల కేంద్రంలో జరగగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా మోడీ ప్రభుత్వం పేదలను, కార్మికులను కొట్టి ఆదాని,అంబానీ లాంటి వ్యక్తుల ఆస్తులు లక్షల కోట్లలో పెరుగుతూ, దేశంలో మును పెన్నడూ లేనివిధంగా పేదరికం, నిరుద్యోగం, ఆకలి పేరుగుతూ, గుప్పెడు మంది చేతిలో అపార సంపద పోగు పడటం అత్యధికమంది దగ్గర అతి స్వల్ప సంపద ఉండటం ఈ ప్రభుత్వ దివాళాకోరు ఆర్థిక విధానాలకు నిదర్శనం అని విమర్శించారు. అనేక ఏళ్లుగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్,పెన్షన్ విధానాన్ని అమలుపరిచి, ఇందిరమ్మ ఇళ్ల, ఇతర సంక్షేమ పథకాల మంజూరిలో ప్రాధాన్యత ఇచ్చి, వారు పని చేసే చోట నిత్యం అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్న కార్మికులకు పని భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి, పెరుగుతున్న ధరల కనుగుణంగా రేట్ల విషయంలో స్థిరమైన విధానాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు బొల్లం ఉప్పలయ్య, నాయకులు బుడమ వెంకన్న, తురక రమేష్, దూదికట్ల సారయ్య, కాట్యాల కృష్ణ,బొల్లం విజయ్, అప్పల వెంకన్న, టి రమేష్, సైదులు, వెంపటి వీరన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల పెండింగ్ బిల్లులు అడిగితే అక్రమ అరెస్టులా

- అక్రమ అరెస్టులతో ఉద్యమం ఆపలేరు
- రాష్ట్ర మాజీసర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాయపోల్ మాజీ సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్యని అన్నారు.పెండింగ్ బిల్లులు ఇవ్వాలని గత 32 నెలల కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటని రాష్ట్రవ్యాప్తంగా ఆయా గ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కోట్ల రూపాయలు బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ కు తరలించడం దారుణమని అన్నారు.వందల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయన్నారు .సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.

## రూ. 3 లక్షల అప్పుకు నాలుగేళ్ల బానిసత్వం

**నిర్మాణ భవనంలో దంపతుల అక్రమ నిర్బంధం**



**సైబరాబాద్ విశాల భారతి:** భార్య ప్రాణాలు కాపాడుకునేందుకు తీసుకున్న రూ. 3 లక్షల అప్పు.. ఆ దంపతుల జీవితాల్లో తీరని చీకట్లను నింపింది. అప్పు తీర్చలేదనే సాకుతో నాలుగు గోడల మధ్య బంధించి, గత నాలుగేళ్లుగా వారి స్వేచ్ఛను హరించి బానిసలుగా మార్చిన అమానుష ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది.మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఎంఆర్ఐ) ఎ. శ్రీను అందించిన పంచనామా వివరాల ప్రకారం.. శ్రీనివాస్ అనే వ్యక్తి తన భార్య రమ్య వైద్య చికిత్స నిమిత్తం అత్యవసర పరిస్థితుల్లో కాంట్రాక్టర్ రాములు వద్ద రూ. 2 లక్షలు, మరో కాంట్రాక్టర్ కృష్ణ వద్ద రూ. 1 లక్ష చొప్పున మొత్తం రూ. 3 లక్షల అప్పు తీసుకున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆ అప్పును సకాలంలో తీర్చలేకపోయాడు. దీన్ని అదనుగా చేసుకున్న సదరు కాంట్రాక్టర్లు ఇద్దరూ అత్యంత క్రూరంగా వ్యవహరించారు.శ్రీనివాస్,ఆయన భార్య రమ్యను మియాపూర్ న్యూ హఫీజ్‌పేట్‌లోని ప్రేమ్‌నగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనానికి బలవంతంగా తరలించారు. అక్కడ వారిని అక్రమంగా నిర్బంధించి, గత నాలుగేళ్లుగా వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. కనీసం బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టే స్వేచ్ఛ కూడా ఇవ్వకుండా, బెదిరింపులకు గురిచేస్తూ నిరంతరం శ్రమదోపిడీకి పాల్పడ్డారు.ఈ దారుణమైన బానిసత్వంపై సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు రంగంలోకి దిగారు.ఈ అమానుష ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు బాధితుల నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.

# తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు: జక్కిడి ప్రభాకర్ రెడ్డి

- ఏఐతో రూపొందించిన నకిలీ వీడియోలతో దుష్ప్రచారం..
- సామాజిక వర్గాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

గత నాలుగు దశాబ్దాలుగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గత మూడు రోజులుగా తనపై, తన కుమారుడు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డిపై సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తమ కుటుంబం రాజకీయ ప్రయాణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలిచారని, తాము కూడా అన్ని వర్గాలను సమాన గౌరవంతో ఆదరిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేశామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రజల సేవలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. తన గురించి, తన కుమారుడి గురించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న వీడియోలు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన నకిలీవని పేర్కొన్నారు.రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంకా మరిన్ని వీడియోలు విడుదల చేస్తామని ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ తప్పుడు వీడియోలను బీసీ సామాజిక వర్గాలకు చెందిన యాదవ, గౌడ కులాలతో ముడిపెట్టి సామాజిక విభేదాలు సృష్టించే ప్రయత్నం చేయడం అత్యంత బాధాకరమని జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని ఏ సామాజిక వర్గానికీ ఆపాదించవద్దని, ఎవరూ ఇటువంటి నకిలీ వీడియోలు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు వాస్తవాలను మాత్రమే విశ్వసించాలని, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటు విలువైనదే... సవరణ ప్రక్రియలో భాగస్వాములు కండి



- అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ..
- మాజీ జెడ్పీటీసీ బింగి దేవదాస్ గౌడ్, మాజీ ఎంపీపీ బుర్ర రేఖా మహేందర్ గౌడ్ పాల్గొని ప్రజలకు అవగాహన

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు, బీఎల్ఏల సమక్షంలో అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేసి ఓటరు సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్ , మండల మాజీ ఎంపీపీ బుర్ర రేఖామహేందర్ గౌడ్ పాల్గొని ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పిలుపునిచ్చారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ వివరాలను ఒకసారి పరిశీలించి అవసరమైన సవరణలు ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు.ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలకమని, అందరూ బాధ్యతగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి సుష్మ అశోక్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తుల్జా ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, నాయకులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం... డెంటల్ విద్యార్థిని మృతి, మరో యువకుడికి తీవ్ర గాయాలు

**రాజేంద్రనగర్,విశాల భారతి :**



ఔటర్ రింగ్ రోడ్ ( ఓఆర్ఆర్ )పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 21 ఏళ్ల డెంటల్ విద్యార్థిని దుర్మరణం చెందింది. ఈ విషాద ఘటన మంగళవారం ఉదయం తుక్కుగూడ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్‌కు చెందిన అడ్డంకి మధుసూదన్ కుమార్తె అమూల్య (21), ఎంఎన్ఆర్ కాలేజీలో డెంటల్ విద్యార్థిని. ఈ నెల 14వ తేదీ తెల్లవారుజామున సుమారు 1:30 గంటల సమయంలో తన స్నేహితుడు సిద్ధార్థ్‌తో కలిసి కారులో శంషాబాద్ వైపు వెళ్లింది. అక్కడ కొంత సమయం గడిపిన అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గం తప్పి పెద్ద అంబర్‌పేట్ వైపు వెళ్లే రూట్‌లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో పెద్ద గోల్కొండ ఎగ్జిట్ టోల్‌గేట్ దాటిన తరువాత ఉదయం సుమారు 6 గంటల సమయంలో అమూల్య నడుపుతున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని, తిరిగి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అమూల్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కారులో ఉన్న సిద్ధార్థ్‌కు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న ఓఆర్ఆర్ పట్రోలింగ్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని తరలించారు. అనంతరం మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇన్స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు.

## కోవర్టుల కుట్రపై శివచరణ్ రెడ్డి ఆగ్రహం

- స్క్రిప్ట్ చదివినట్లుగా వైరల్ వీడియోలో స్పష్టత
- ఏఐతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ, అసత్యాలను నమ్మొద్దని విజ్ఞప్తి



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :**

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు కోవర్టులు పథకం ప్రకారం తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని ఆయన వర్గీయులు ఆరోపించారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియోను పరిశీలిస్తే, కొందరు వ్యక్తులు తమ సొంత అభిప్రాయాలను కాకుండా ముందుగానే సిద్ధం చేసి ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతున్నట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇదే ఇచ్చారు... ఇదే చదవమన్నారు... అని వారు చెప్పడం ఈ వ్యవహారంపై అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా సోషల్ మీడియా వేదికగా తన పేరుతో జరుగుతున్న అవాస్తవాలు, అసత్య ప్రచారాలను జక్కిడి శివచరణ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను వ్యక్తిగతంగా ఏ వ్యక్తిని గానీ, ఏ కులాన్ని గానీ దూషించలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న కొన్ని ఆడియోలు, వీడియోలు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతతో రూపొందించినవిగా కనిపిస్తున్నాయని, వాటిని సందర్భానికి విరుద్ధంగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక కొందరు నాయకులు పక్కా ప్రణాళికతో ఈ తప్పుడు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. గతంలో మన్సూరాబాద్‌లో జరిగిన ఫ్లెక్సీ వివాదాన్ని ప్రస్తుత పరిణామాలకు ముడి పెట్టి అసత్య కథనాలు సృష్టిస్తున్నారని, ప్రజలు ఇటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. యువజన కాంగ్రెస్‌లో అన్ని కులాలు, మతాలు, వర్గాలకు చెందిన యువతతో కలిసి పనిచేస్తున్నామని, తమకు కుల భావన లేదని, మాకు ఉన్నది ఒక్కటే కులం... అదే యువకులం అని పేర్కొన్నారు. కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం ఈ వ్యవహారాన్ని ఉద్దేశపూర్వకంగా కులసంఘాలకు ముడి పెట్టి వివాదం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను పూర్తిగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ ప్రచారాల వల్ల ఏదైనా కులసంఘం లేదా వర్గానికి చెందిన వారి మనోభావాలు దెబ్బతిన్నట్లయితే వారికి భేషరతుగా క్షమాపణలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని, సామాజిక సామరస్యాన్ని కాపాడాలని జక్కిడి శివచరణ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## బృందావన్ కాలనీలో సమస్యలపై తోకల శ్రీనివాస్ రెడ్డి సడెన్ పర్యటన



**రాజేంద్రనగర్,విశాల భారతి :** డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు బస్తీలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గం ఇంచార్జ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ సమస్యలు, మెన్యువల్ కవర్ల పరిశుభ్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలు పునరావృతం కాకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అలాగే స్థానిక నాయకులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, బస్తీ కాలనీల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల భాస్కర్ యాదగిరి, జై రామ్, దీపక్, గణేష్, భరద్వాజ్, రితిష్ శర్మ, దీపక్ సింగ్, రేఖ అనితా, షాలిని తదితరులు మరియు స్థానిక యువకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలి

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ను కలిసి కోరిన తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ప్రతినిధులు..**



**ముషీరాబాద్ విశాల భారతి:** విద్యా ఉద్యోగ ఉపాధి, ఆర్థిక రంగాల్లో ఆదివాసులకు న్యాయం జరిగేందుకు వెంటనే రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టి కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ దిల్ కుష్ గెస్ట్ హౌస్ లో ఉన్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ను సంఘ అధ్యక్షులు లోకిని రాజు నేతృతంలో ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి త్వరగతినా ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని హుస్సేన్ నాయక్ ను కోరారు. అనంతరం లోకిని రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎరుకల సామాజిక వర్గం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను జాతీయ ఎస్టి కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సిన హక్కులు, సంక్షేమ పథకాల అమలు, విద్య, ఉపాధి, ఇందిరమ్మ గృహాలు, ట్రైకార్ నిధులు, ప్రభుత్వ భూములు, సామాజిక న్యాయం, ప్రభుత్వ ఉద్యోగాలు రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.అలానే పందులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల కోసం ఎరుకల ఎంపవర్మెంట్ స్కీంను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా అనేక విషయాలు అంశాలను కమిషన్ సభ్యుని దృష్టికి తీసుకెళ్లామని వారు కూడా సానుకూలంగా స్పందించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కలిసిన వారిలో ఎం వి రమణ, కూతాడి రవికుమార్, కోనేటి నరసింహ, కేతిరి రాజయ్య, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలి : మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**అబ్దుల్లాపూర్ మెట్ , విశాల భారతి :** హయత్‌నగర్ మండల కార్యాలయ ఆవరణలోని శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం సందర్భంగా విడుదల చేసిన ఆహ్వాన పత్రికను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆగస్టు 11న నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, సమాజంలో భక్తి భావాన్ని, సామరస్యాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఆగస్టు 11, 2026న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ గ్రామ పెద్ద కళ్లెం శంకర్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, హయత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగౌని శ్రీధర్ గౌడ్, ఆలయ గౌరవ అధ్యక్షుడు పారంద స్వామి, మాజీ అధ్యక్షుడు ఎర్ర రవీందర్, అధ్యక్షుడు క్యాదాస్ సతీష్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పిట్టల జంగం ముదిరాజ్, పారంద అరవింద్, ఇతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ముచ్చింతల్‌లో ఆధ్యాత్మిక మహోత్సవం.. 'సుందర విజయం' వైభవం

**రాజేంద్రనగర్,విశాల భారతి :** ముచ్చింతల్‌లోని జీవా ప్రాంగణంలో గల దివ్యసాకేత క్షేత్రంలో "సుందర విజయం" కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ దివ్య మంగళాశాసనాల నడుమ నిర్వహించిన ఈ మహోత్సవం భక్తులను ఆధ్యాత్మిక లోకంలోకి తీసుకెళ్లింది. సమాజ శ్రేయస్సు కోసం చేపట్టిన 108 అమావాస్యల సంపూర్ణ సుందరకాండ పారాయణ మహాయజ్ఞంలో భాగంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమంతుడికి తేనెతో అభిషేకం చేసి భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచారు. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలోని గోశాలలో గోవులకు విశేష పూజలు చేసి, గ్రాసం సమర్పించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మై హోమ్ గ్రూప్ అధినేత డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు , వారి ధర్మపత్ని శ్రీకుమారి పాల్గొని గోసేవ చేసి భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం వారు సుందరకాండ పారాయణంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామీజీ వారు రామేశ్వరరావు దంపతులకు మంగళాశాసనాలు అందించి, పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరించగా, ముచ్చింతల్ క్షేత్రం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడింది.

విశాల భారతి





# అతిథి పాత్రకు 15కోట్లు?

పారితోషికాల విషయంలో హీరోలతో పోటీపడుతూ తగ్గేదేలే అంటున్నారు అగ్ర కథానాయికలు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్స్ రెమ్యునరేషన్ కూడా రెండుమూడు కోట్లకు మించేది కాదు. కానీ ఇప్పుడు సినీ వ్యాపార సమీకరణాలు మారిపోయాయి. పాన్ ఇండియా ట్రెండ్‌తో పాటు నాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు ఆదరణ పెరగడంతో హీరోయిన్స్ సైతం భారీ పారితోషికాలను డిమాండ్ చేస్తున్నారు. దక్షిణాదితో పాటు హిందీలో అగ్ర కథానాయికలు పదికోట్లకు పైగా రెమ్యునరేషన్ అందుకోవడం సాధారణంగా మారింది. అయితే బాలీవుడ్ భామ అలియాభట్ అతిథి పాత్రకోసమే 15కోట్ల రెమ్యునరేషన్ స్వీకరించి ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. హిందీ సూపర్‌హిట్ హారర్ ఫిల్మ్ 'తుంబాడ్'కు సీక్వెల్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. సోహమ్‌షా హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి అనిల్ బావ్రే దర్శకుడు. ఇందులో అలియా కీలకమైన అతిథి పాత్రను పోషిస్తున్నది. కేవలం పదినిమిషాల నిడివిగల ఈ పాత్ర కోసం మేకర్స్ అలియాభట్‌కు 15 కోట్ల రెమ్యునరేషన్‌ను ఆఫర్ చేశారని తెలిసింది. పాన్ ఇండియా స్థాయిలో అలియాభట్‌కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకొని ఆమె కోరినంత పారితోషికాన్ని ఇచ్చారని బాలీవుడ్ ట్రేడ్‌వర్గాల్లో వినిపిస్తున్నది. త్వరలో ఈ సినిమా సెట్స్‌లో అలియాభట్ జాయిన్ కానుంది. ఈ సీక్వెల్‌లో నవాజుద్దీన్ సిద్ధికీ సైతం ఓ హీరోగా నటిస్తున్నారు. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.